ప్రతి గింజను
కొనుగోలు చేయాలి

మంచాల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నర్మద

మంచాల, మే 22: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే గ్రామ ప్రత్యేకాధికారులు పరిష్కరించాలని మంచాల ఎంపీపీ జాటోతు నర్మద అన్నారు. మంచాల మండల సర్వ సభ్య సమావేశం ఆమె అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో వివిధ గ్రామాల ఎంపీటీసీలు గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను సభా దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ నర్మద మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న వడ్లను కొనుగోలు చేయడంలో డీసీఎంఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద రాత్రి, పగలు వడ్ల కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులకు తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను వెంటనే కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు మిషన్ భగీరథ అధికారులు దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ నిత్య, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, సహకార సంఘం చైర్మన్ పుల్లారెడ్డి, ఎంపీడీవో బాల శంకర్, తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు, ఎంపీటీసీలు రమేశ్, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, రాందాస్, సదానందం, మధుసూదన్‌రెడ్డి, అనిత, సుకన్య, ఫరంగి, కోఆప్షన్ సభ్యుడు వాజీద్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

వ్యవసాయశాఖ అధికారి శ్రీలత

మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో శ్రీలత

కడ్తాల్, మే 21: నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఏవో తనిఖీ చేసి, ఎరువుల నిల్వలతోపాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ దుకాణదారులు రైతులకు విత్తనాలు విక్రయించినప్పుడు విధిగా రసీదులు అందజేయాలని తెలిపారు. అధిక ధరలకు విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ-పాస్ ద్వారా పంటల సాగుకు వాన కాలానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. దుకాణుదారులు ఈ-పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని సూచించారు. ఈ తనిఖీలో వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

జాగ్రత్తలు పాటిస్తేనే వ్యాధుల నివారణ

ఇన్ముల్‌నర్వలో గేదెకు వ్యాక్సిన్ ఇస్తున్న పశువైద్యాధికారి స్ఫూర్తి

కొత్తూరు, మే 22: జాగ్రత్తలతో పశువులను వ్యాధుల నుంచి దూరం చేయవచ్చని మండల పశువైద్యాధికారి డా. స్ఫూర్తి అన్నారు. మండల పరిధిలోని పెంజర్లలో 356 గొర్రెలు, 40 మేకలకు బుధవారం చితుకరోగం నివారణ టీకాలు వేశారు. అలాగే ఇన్ముల్‌నర్వ గ్రామంలో 300 గేదెలకు గొంతువాపు నివారణ(హెచ్ఎస్) వ్యాక్సినేషన్ వేశారు. ఈ సందర్భంగా డా. స్ఫూర్తి మాట్లాడుతూ వేసవిలో పాడి పశువులకు వ్యాక్సినేషన్ చేస్తే వ్యాధులను నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కృష్ణ, సులేమాన్, రవి, రైతులు పాల్గొన్నారు.

షాబాద్ : జీవాల ఆరోగ్యంపై రైతులు జాగ్రత్తలు పాటించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని మద్దూర్ గ్రామంలో జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 22 నుంచి 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీను, కృష్ణ ఉన్నారు.

ఆమనగల్లును రెవెన్యూ డివిజన్ ప్రకటించాలి

ఆమనగల్లు, మే 22: అభివృద్ధిలో అన్ని రంగాల్లో వెనుకబడిన ఆమనగల్లును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని మండల జడ్పీటీసీ నేనావత్ అనురాధ అన్నారు. బుధవారం ఆమనగల్లు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి జడ్పీటీసీ అనురాధ మాట్లాడుతూ ఆమనగల్లు పూర్వపు గ్రామాలను కలుపుకొని ఆమనగల్లును రెవెన్యూ డివిజన్‌గా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ రాములు, మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, బీఆర్ఎస్ యువజన నాయకులు వెంకటేశ్, రమేశ్, ఆనంద్, గణేశ్ ఉన్నారు.

పకడ్బందీగా నర్సరీల నిర్వహణ చేపట్టాలి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య

షాబాద్, మే 22: హరితహారం నర్సరీల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...హరితహారం నర్సరీల్లో మొక్కల పెంపకం పకడ్బందీగా చేపట్టాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా నీరు పోసి సంరక్షించాలని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశాలకు గ్రామాల ప్రత్యేకాధికారులకు తప్పనిసరిగా హాజరుకావాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాకే
ఎన్నికలు నిర్వహించాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌ను కలిసిన మాజీ సర్పంచ్‌లు

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకులు

కడ్తాల్, మే 22: ప్రభుత్వం సర్పంచ్‌లకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించిన తర్వాతే గ్రామ పంచాయతీలకు ఎన్నికలను నిర్వహించాలని సర్పంచ్‌ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణలోని గ్రామాలను అభివృద్ధి పరుచాలనే ఆకాంక్ష, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలైన వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్‌యార్డులు, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు తదితర కార్యక్రమాలను విడుతల వారీగా పూర్తి చేసినట్లు సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, జేఏసీ కమిటీ అధ్యక్షుడు యాదయ్య అన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిన సర్పంచ్‌లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో కమిషనర్ పార్థసారథిని సర్పంచ్‌ల సంఘం నాయకులు కలిశారు. సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బిల్లులు విడుదల చేసిన తర్వాతే గ్రామ పంచాయతీలకు ఎన్నికలకు నిర్వహించాలని కమిషనర్‌కు వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ప్రధాన కార్యదర్శి ప్రనీల్‌చందర్, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, సముద్రాల రమేశ్, పంబ కరుణాకార్, రామకృష్ణ, శ్రీనివాస్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, మే 22: జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశానికి ప్రకటన వెలువడిందని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డిజిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కే.నవీన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరంలో పదవ తరగతిలో 7.0జీపీఏ అంతకంటే ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ ఆదర్శ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు అర్హులని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ http://telanganaepass.cgg.gov.in లో ఈ నెల 30 వరకు దరఖాస్తును సమర్పించవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, కాలేజీ అలాట్‌మెంట్ ఆర్డర్ జూన్ 6న ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న పొల్యూషన్, మున్సిపల్ సిబ్బంది

కొత్తూరు, మే 22: పాలిథీన్ భూతం వల్ల పర్యావరణానికి పెను ప్రమాదం పొంచిఉందని పొల్యూషన్ ఫీల్డ్ ఆఫీసర్ వడ్డెరాజు అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని పలు దుకాణదారులకు పాలిథీన్ కవర్ల వాడకంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వడ్డె రాజు మాట్లాడుతూ 25 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న కవర్లను వాడవద్దని చెప్పారు. ఇవి మట్టిలో కలిసిపోవడానికి ఎక్కువ సమయం తీసుకుంటుందన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కిరణ్‌చారి, వార్డు ఆఫీసర్స్ శ్రీనివాస్, హనుమంతు, నర్సింహ, బిల్ కలెక్టర్లు ఆంజనేయులు, వెంకటేశ్, శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు

- జోరుగా నర్సరీల్లో మొక్కల పెంపకం
- నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు
- మండలంలో 3.70 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక

చేవెళ్ల రూరల్, మే 22 : గ్రామాల్లో గ్రీనరీ పెంపునకు అధికారులు కృషి చేస్తున్నారు. ఈ సంవత్సరం చేవెళ్ల మండలవ్యాప్తంగా 37 గ్రామ పంచాయతీల్లో ప్రతి గ్రామంలో 10 వేల మొక్కల చొప్పున 3.7 లక్షల మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం ఏస్తున్నారు. ప్రధాన పంచాయతీలతో పాటు అనుబంధ గ్రామాల్లో లక్ష్యానికి మించి మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.

సీడింగ్ పనులు..

రోడ్లకు ఇరువైపులా, క్రీడా మైదానాలు, పల్లె ప్రకృతివనాల్లో మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో ఇదివరకే కవర్లలో మట్టిని నింపి మొక్కల సీడింగ్ పనులు పూర్తి చేసి నీటిని పడుతున్నారు. సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేస్తూ హరిత లక్ష్యం సాధన దిశగా ముందకు సాగుతున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం..

గ్రామాల్లో హరితహారం మొక్కల పెంపకంపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నాం. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించి వాటి సంరక్షణ బాధ్యతలు వన సంరక్షకులు చూసుకునేలా చేశాం. మండలంలో ఒక్కో గ్రామ పంచాయతీలో 10 వేల మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాం. లక్ష్యం 3.70 లక్షల మొక్కలు ఉండగా లక్ష్యానికి మించి నాటేందుకు ప్రయత్నం చేస్తున్నాం. హరితహారంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తూ ముందుకు సాగితేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం.

- హిమబిందు, ఎంపీడీవో, చేవెళ్ల

ప్రభుత్వ భూమిని కాపాడండి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 22 : అబ్దుల్లాపూర్‌మెట్ సర్వేనం 283 ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు వినతిపత్రం సమర్పించారు. 2005లోనే పీవోటీ కింద తీసుకోవడం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య వివరించారు. ఈ భూమిలో జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ నిర్మించారని, ఇందిరమ్మ ఇండ్ల కింద 10 ఎకరాల్లో సిర్టిఫికెట్లు ఇచ్చినట్లు తెలిపారు. అదే విధంగా తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ కార్యాలయాలు నిర్మించారని పేర్కొన్నారు. కొంత మంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, స్థానిక నాయకులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై పల్లె ప్రగతికి కేటాయించిన స్థలంలో కూడా ప్లాట్లు చేసి ఫ్రీకాస్టు వేస్తున్నారని తెలిపారు. అర్హులైన పేదలకు 60 గజాల ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గుడిసెలు వేస్తే విపరీతంగా లాఠీ చార్జి చేసి కేసులు పెట్టారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి మండలంలో ఎక్కడ ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనా వాటిని రక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు శివకుమార్, భిక్షపతి, శివశంకర్ తదితరులు ఉన్నారు.

కల్యాణం..కమనీయం

స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆదిబట్ల, మే22: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్ గ్రామంలో మంగళవారం రాత్రి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్వామి వారి కల్యాణంలో పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. తన వెంట ఇబ్రహీంపట్నం జడ్పీటీసీ మహిపాల్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఆర్తికాతో పాటు నాయకులు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దు

ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్

రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను మున్సిపల్ సిబ్బందితో తొలగింపజేస్తున్న ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్

షాద్‌నగర్‌టౌన్, మే 22: షాద్‌నగర్ పట్టణ ప్రధాన దారిలో దుకాణ యజమానులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దని షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం పట్టణ ప్రధాన దారిలో రోడ్డు ఆక్రమించి ఏర్పాటు చేసిన వ్యాపారానికి సంబంధించిన వస్తువులను మున్సిపల్ సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే ప్రధాన దారిలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, రోడ్డును ఆక్రమించి దుకాణ యజమానులు ఎవరూ కూడా వ్యాపారాలకు సంబంధించిన ఎలాంటి వస్తువులను పెట్టరాదన్నారు. ట్రాఫిక్ నియమనిబంధనలను అందరూ పాటించాలని సూచించారు.

ఉద్యమాలకు భాగ్యరెడ్డి వర్మ ఆదర్శం



ఆమనగల్లు, మే 22: మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి జయంతిని సామాజిక ఉద్యమ వేదిక నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమ వేదిక నాయకులు జి.వెంకటేష్, జె. కుమార్, లక్ష్మయ్య, శ్రీను, జంగయ్య, యాదయ్య, సాలయ్య, పెంటయ్య, మల్లేశ్ ఉన్నారు.

ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

షాద్‌నగర్‌రూరల్, మే 22 : ఫరూఖ్‌నగర్ మండలంలోని మధురాపూర్ గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో బాలబాలికలకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలోని బాలబాలికలకు ఆంగ్లంలో మంచి పట్టు ఉండాలనే లక్ష్యంతో ఈ ఉచిత తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను అందజేస్తామని పేర్కొన్నారు.

తండాల్లో సమస్యలను పరిష్కరించండి

యాచారం, మే22: జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోతు హుస్సేన్‌నాయక్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు సబావత్ గణేశ్‌నాయక్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలను, గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సబావత్ ప్రసాద్ తదితరులున్నారు.

పొంచిఉన్న ప్రమాదం

షాద్‌నగర్‌టౌన్, మే 22: షాద్‌నగర్ పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయ గేట్ దిమ్మె ప్రమాదకరంగా మారింది. దిమ్మె పూర్తిగా పక్కకు ఒరిగిపోయింది. కార్యాలయ చుట్టుపక్కల ఉన్న పిల్లలు అక్కడే ఆటలు ఆడుకుంటారు. ప్రమాదకరంగా మారిన గేట్ దిమ్మె ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దిమ్మెకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

బడంగ్‌పేట, మే22: మహేశ్వరం నియోజక వర్గం పరిధిలోని మీర్‌పేట,బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లు, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అధికారులు, సిబ్బంది వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై చర్చించారు. పూడిక తీత పనులు, నాలాల, మ్యాన్ హోల్స్‌లను క్లీన్ చేయాలని తగిన ఆదేశాలు జారీచేశారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్లు అధికారులకు, సిబ్బందికి సూచించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా చూడటానికి యాక్షన్ ప్లాన్ ఏర్పాటు చేశారు.

మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

చేవెళ్ల టౌన్, మే 22 : చేవెళ్ల ఎంపీగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలువడం ఖాయమని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహులు, డైరెక్టర్ వెంకటేశ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు చేవెళ్ల ప్రజల మద్దతు ఉందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించారని, అందుకే ప్రజలు బీఆర్ఎస్ గెలుపునే కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ పామెన గ్రామ కమిటీ యూత్ అధ్యక్షుడు రాజు, నాయకులు పాల్గొన్నారు.

తప్పిపోయిన యువకుడిని
పట్టుకున్న పోలీసులు

కొత్తూరు, మే 22: తప్పిపోయిన యువకున్ని కొత్తూరు పోలీసులు బుధవారం గుర్తించారు. వివరాల్లోకి వెళితే బిందుసూర్య కంపెనీలో పనిచేసే ఉద్యోగి సుజిత్‌దాస్ ఈ నెల 19న తప్పిపోయాడు. ఈ మేరకు కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రత్యేక బృందాల సహాయంతో పోలీసులు అనుమానాస్పద ప్రదేశాల్లో వెతికారు. చివరకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సుజిత్‌దాస్‌ను గుర్తించారు. అనంతరం కొత్తూరుకు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే సుజిత్‌దాస్‌కు మద్యం సేవించే అలవాటు ఉంది. దీంతో అతడు తాగిన మైకంలో కొత్తూరులో సిటీ బస్సు ఎక్కి అప్జల్‌గంజ్‌లో దిగాడు. అక్కడి నుంచి సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకున్నాడు. అతను ఫోన్ తీసుకొని వెళ్లకపోవడంతో అతన్ని గుర్తించడానికి కుటుంబ సభ్యులకు ఇబ్బంది ఏర్పడింది. చివరకు కొత్తూరు పోలీసులు అతన్ని తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పచెప్పడంతో కథ సూఖాంతం అయింది.

సుజిత్‌దాస్‌ను చూపిస్తున్న కొత్తూరు పోలీసులు

ఆర్టీసీబస్సు, బైక్ ఢీ.. ఒకరి మృతి

కడ్తాల్, మే 22: ఆర్టీసీ బస్సు-బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం తలకొండపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన కురాకుల మల్లేశ్ (40), బైక్‌పై ఆమనగల్లు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలోని జంగారెడ్డిపల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న మల్లేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. మృతుడికి భార్య వరలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రమాద దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

షాబాద్, మే 22: రైతులకు సబ్సిడీపై జనుము విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు షాబాద్ మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాబాద్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం నందు ఈ వానకాలం సీజన్‌కు సంబంధించి 60శాతం సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జనుము విత్తనాలు 104 క్వింటాళ్లు, జీలుగ విత్తనాలు 26 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. జనుములు 40 కిలోల బస్తా సబ్సిడీ పోను రూ.1448, జీలుగ 30కిలోల బస్తా రూ.1116 రైతులు చెల్లించాలన్నారు. గురువారం నుంచి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. మండలంలో జనుము, జీలుగ విత్తనాలు అవసరం ఉన్న రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని వచ్చి విత్తనాలు తీసుకోవాలన్నారు.

షాద్‌నగర్‌లో..

షాద్‌నగర్‌టౌన్ : షాద్‌నగర్ పట్టణంలోని కేశంపేట్‌రోడ్డులో ఆగ్రో రైతు సేవ కేంద్రంలో సబ్సిడీపై జనుములు, జీలుగ, పచ్చి రొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయాధికారి నిశాంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనుములు క్వింటాల్ అసలు ధర రూ. 9050, సబ్సిడీపై రూ. 3620, జీలుగ విత్తనాలు క్వింటాల్ అసలు ధర రూ. 9300, సబ్సిడీపై రూ. 2790, అదే విధంగా 40కేజీల జనుముల బస్తా అసలు ధర 3620, సబ్సిడీపై రూ. 1448, 30కేజీ జీలుగా బస్తా అసలు ధర రూ. 3720, సబ్సిడీపై రూ. 1116కు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక్క రైతుకు 5ఎకరాల వరకు 2బస్తాలు మాత్రమే సబ్సిడీపై ఇవ్వనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు
అంతరాయం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 22 : అబ్దుల్లాపూర్‌మెట్ 33/11కేవి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవి సంఘీ ఫీడర్, 11కేవి అనాజ్‌పూర్ ఫీడర్ కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ విద్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ